క్లుప్తంగా

ఇన్‌చార్జి ఎంఈఓ-1గా వెంకటేశ్వరరావు



కొల్లూరు: పాఠశాలల నిర్వహణ తీరుతెన్నులు, విద్యాశాఖ వ్యవహారాల నిర్వహణకు కొల్లూరు మండలానికి ఇన్‌చార్జి ఎంఈఓను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ ఉత్తర్వులలో భాగంగా వేమూరు ఎంఈఓగా పనిచేస్తున్న ఐ.వెంకటేశ్వరరావు బుధవారం కొల్లూరులోని మండల విద్యావనరుల కేంద్రంలో ఇన్‌చార్జి ఎంఈఓ-1 గా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మండలంలోని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

శ్మశానవాటిక స్థల సేకరణకు సర్వే



కోళ్ళపాలెం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని కోళ్లపాలెంలో శ్మశాన వాటిక స్థల సేకరణకు సంబంధించి రెవెన్యూ అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గ్రామ వాసులు శ్మశాన వాటిక సమస్యను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున దృష్టికి తీసుకు వచ్చారు. ఎన్నో ఏళ్లుగా శ్మశాన వాటిక లేకపోవడంతో రహదారుల వెంట ఖననం చేయాల్సి పరిస్థితి నెలకొందని తెలిపారు. స్పందించిన మంత్రి నాగార్జున స్థల సేకరణ చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ బొర్రా శ్రీనివాసరరావు గ్రామంలో ప్రభుత్వ భూములకు సంబంధించి సర్వే చేపట్టారు. ఆయన వెంట వీఆర్‌ఓ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు నీలా నాగరాజు, పంచాయతీ వార్డు సభ్యులు, సంఘ పెద్దలు ఉన్నారు.

పోలింగ్‌బూత్‌ల పరిశీలన



రేపల్లె రూరల్: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో ఓటర్ల జాబితా తయారు చేయటంతో పాటు పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు అవసరమైన కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్లు రేపల్లె ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి తెలిపారు. పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌లను బుధవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలు ప్రస్తుతం ఉన్న స్థితితో పాటు, ఆయా కేంద్రాలలో ఏర్పాటు చేయాల్సిన మలిక సదుపాయాలను పరిశీలించామన్నారు. నియోజకవర్గంలో ఏర్పాటు చేసే కేంద్రాల వివరాలపై ఉన్నతాధికారులకు నివేదికను పంపటం జరుగుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ విజయసారథి, సీనియర్ అసిస్టెంట్ విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంచారజాతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

సంచార జాతుల కార్పొరేషన్ చైర్మన్ పెంద్రా వీరన్న



బాపట్ల: సంచారజాతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని సంచార జాతుల రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పెంద్రా వీరన్న పేర్కొన్నారు. బాపట్లలోని దివ్యాంగుల సంక్షేమ కార్యాలయంలో బుధవారం సమావేశంలో పెంద్రా వీరన్నను సన్మానించారు. ఈసందర్భంగా పెంద్రా వీరన్న మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంచారజాతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన

ఫిరంగిపురం: మండలంలోని గరుడాచల పాలెం ఎంపీపీఎస్ పాఠశాలలో ఫిరంగిపురం పీహెచ్‌సీ సెక్టారు ఆధ్వర్యంలో బుధవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం సాంబశివరావు విద్యార్థులు ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఫిరంగిపురం సెక్టారు వైద్యాధికారి టి.ఎస్తేరురాణి మాట్లాడుతూ ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వర్షాకాలం కావడంతో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వేడిగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో పిల్లల బరువు, ఎత్తు, రక్తపూత పరీక్షలు చేశారు.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధి కరపత్రం అందిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- మండూరులో గడప గడపకు మన ప్రభుత్వం

మండూరు(వేమూరు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి గడపలో సంతోషాలు వెల్లివిరుస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చుండూరు మండలం మండూరు గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందని అర్హులు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో 200 గడపలకు వెళ్లి వారికి ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరిస్తూ, సమస్యలను తెలుసుకున్నారు. ఎంపీటీసీ సూర్య ప్రసన్న, గ్రామ సర్పంచ్ జొన్న కూటి ఉమాదేవి, రెడ్డి రాజేంద్రప్రసాద్, రెడ్డి లక్ష్మీనారాయణ, జొన్నకూటి రాజేశ్వరావు, వాసు రెడ్డి, దేవిరెడ్డి వెంకటేష్, రఘురామ రెడ్డి, రెడ్డి వెంకటరావు, సర్పంచ్ సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దేవాలయాల నిర్మాణాలకు ఎమ్మెల్యే విరాళం

పిట్టలవానిపాలెం: మండలంలోని పలు గ్రామాలలో నూతనంగా నిర్మిస్తున్న దేవాలయాలకు బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి విరాళాన్ని బుధవారం బాపట్లలోని ఆయన స్వగృహంలో అందజేశారు. ఖాజీపాలెం శివారు గౌడ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న రామమందిరం కోసం టీటీడీ వారిచే రూ.10 లక్షలు మంజూరు చేయించారు. తన వంతు సాయంగా రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. అదేవిధంగా గోకరాజునల్లి బోయినవారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అన్నం వారి ఇలవేల్పు సత్తెమ్మ తల్లి అమ్మవారి దేవాలయ నిర్మాణానికి టీటీడీ వారిచే రూ.10 లక్షలు మంజూరు చేయించడంతో పాటు తనవంతు సాయంగా రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈసందర్భంగా కోన రఘుపతిని ఖాజీపాలెం, గోకరాజునల్లి బోయినవారిపాలెం గ్రామసర్పంచ్‌లు, గ్రామపెద్దలు పూలదండవేసి శాలువాకప్పి ఘనంగా సత్కరించారు. జీఎస్‌పాలెం సర్పంచ్ దబ్బకూటి మాధవరావు, బాపట్ల ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, అన్నం శ్రీనివాసరెడ్డి, అన్నం కృష్ణారెడ్డి, అన్నం మోహనరెడ్డి, తోట శ్రీనివాసరెడ్డి, కుంతం ప్రసన్నరాజు, ఖాజీపాలెం సొసైటీ చైర్మన్ కూసంపూడి దేవేంద్రరరాజు, గ్రామపెద్దలు ఉన్నారు.



గౌడకాలనీలో రామమందిరం నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ఇద్దరు డీలర్లపై 6ఏ కేసు నమోదు

నిజాంపట్నం: విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన దాడులలో ఎరువులు స్వాధీనం చేసుకుని డీలర్లపై 6ఏ కేసు నమోదు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం, నగరం మండలం సజ్జవారిపాలెం గ్రామాలలోని ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జవారిపాలెంలోని వాసవీ ఫెర్టిలైజర్స్, కైలాష్ ఫెర్టిలైజర్స్ దుకాణాలలో స్టాక్ బోర్డు, స్టాక్ రిజిస్టర్, బిల్లులు సక్రమంగా లేకుండా వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. ఈ రెండు షాపులలో మొత్తం 11.850 మెట్రిక్ టన్నుల ఎరువులు రూ.2,57,700 విలువ కలిగిన ఎరువులను స్వాధీనం చేసుకుని ఇరువురు డీలర్లపై 6ఏ కేసు నమోదు చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. దాడులు నిర్వహించిన వారిలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (వ్యవసాయ) అధికారి జె.వాసంతి, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య, స్థానిక వ్యవసాయశాఖ అధికారులు ఉన్నారు.



సజ్జావారిపాలెంలో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

తైక్వాండో పోటీలలో బోధిధర్మ క్రీడాకారుల ప్రతిభ

రేపల్లె: హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 14 నుంచి 16వతేదీ వరకు నిర్వహించిన జాతీయస్థాయి తైక్వాండో పోటీలలో రేపల్లె పట్టణానికి చెందిన నిజాంపట్నం బోధి ధర్మ అకాడమీ క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా స్థానిక అకాడమీలో బుధవారం క్రీడాకారులకు నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ముఖ్యకార్యదర్శి కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు క్రీడాకారులు అభినందించి వివరాలు తెలిపారు. పోటీలలో 9 మంది క్రీడాకారులు పాల్గొని 5 బంగారు, 2 రజతం, 2 కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. సైకం యువరాజ్‌వర్మ, మోపిదేవి కౌశిక్, పీత నాగ తనూష, హరిణి, పీత కార్తికేయ బంగారు పతకాలను, కోనేరు చేతన్ చౌదరి, భువనశ్రీ రజత పతకాలను, సైకం కార్తీక్, నూకల రిషిక్‌లు కాంస్య పతకాలను సాధించారు. క్రీడాకారులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. వీరి అభివృద్ధికి కృషి చేసిన కోచ్ రోహిత్ శర్మను అభినందించారు. క్రీడాకారులను అభినందించిన వారిలో అకాడమీ నిర్వాహకులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఏపీ తైక్వాండో అసోసియేషన్ ముఖ్యకార్యదర్శి వెంకటేశ్వరరావు

పీఎండీఎస్ చేలో వరి సాగుకు శ్రీకారం

వల్లభాపురం(తెనాలి): కొల్లిపర మండల గ్రామం వల్లభాపురంలో ప్రకృతి వ్యవసాయం విధానాన్ని బుధవారం క్షేత్రస్థాయిలో నిర్వహించారు. గ్రామానికి చెందిన దాసరి రత్నభాస్కర్ పంట పొలంలో అర ఎకరం విస్తీర్ణంలో పీఎండీఎస్ విధానంలో భాగంగా వేసిన 30 రకాల విత్తనాలు 65 రోజుల వ్యవధి పూర్తయింది. దీనితో ఆ విస్తీర్ణంలో పెరిగిన పంట వేర్లను భూమిలోనే ఉంచి, పైన పైరును మాత్రం కోశారు. అనంతరం భూమిని ఏమాత్రం దున్నకుండా బీజామృతంతో శుద్ధి చేసిన బీపీటీ వరి విత్తనాలను, తాడు సహాయంతో జీరో టిల్లేజ్ పద్ధతిలో చల్లారు. అనంతరం 1500 కిలోల ఘనజీవామృతాన్ని వేశారు. కార్యక్రమంలో వల్లభాపురం, మున్నంగి యూనిట్ ఎస్‌డీఏ సుధారాణి, ఎస్‌ఎఫ్ ఎంటీ నాగకృష్ణ, ఐసీఆర్‌పీఎస్, రైతులు పాల్గొన్నారు.



వేర్లను భూమిలో ఉంచేందుకు పైన పైరు కోత

వృద్ధురాలిని అటకాయించి బ్యాగ్‌తో ఉడాయింపు

తెనాలిరూరల్: వృద్ధురాలిని అటకాయించి ఆమె వద్ద ఉన్న బ్యాగు లాక్కుని గుర్తు తెలియని యువకులు పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ రామలింగేశ్వరపేటకు చెందిన 62 ఏళ్ల గూడూరి సంపూర్ణ ఈ నెల 14వ తేదీన నందులపేటలోని దంత వైద్యశాలకు తన సైకిల్‌పై వెళ్లింది. తిరుగు ప్రయాణంలో నాజరుపేట కాంచన మాల టవర్స్ వీధిలో రామలింగేశ్వరపేట మూడు బొమ్మల సెంటరుకు వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని యువకులు ఆమెను అటకాయించారు. సైకిల్ ముందు భాగంలోని బుట్టలో ఉన్న బ్యాగును లాక్కుని పరారయ్యారు. బాధితురాలు బుధవారం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ సీఐ కె. చంద్రశేఖర్ తెలిపారు.

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి గౌరవ అధ్యక్షుడు కాసా రామశ్రీను సహకారంతో రైల్వేస్టేషన్ రోడ్డులోని అన్నదాన కేంద్రం వద్ద బుధవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, సభ్యులు షేక్ కాలేషా, షేక్ మీరావలి, పాశం వెంకటేష్, ఎస్ఆర్‌కె శర్మ, తుల్లిమిల్లి చంటి, ఆషా, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కారమవుతున్నాయని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. బుధవారం బాపట్ల పట్టణంలోని వివేకానంద కాలనీ, చంగల్రాయి తోట సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులో ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొని దరఖాస్తు దారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ గతంలో సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేందన్నారు. జగనన్న సీఎం అయ్యాక దీనిపై దృష్టి సారించి, వలంటీర్, సచివాలయ వ్యవస్థలతోపాటు జగనన్న సురక్షతో దరఖాస్తు చేసుకున్న వెంటనే ధ్రువీకరణ పత్రాలు అందజేయడం జరుగుతోందన్నారు. వివేకానంద కాలనీ పరిధిలో మొత్తం 1558 దరఖాస్తుల రాగా 1536 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అలాగే చంగల్రాయ తోట సచివాలయం పరిధిలో 474 దరఖాస్తులు రాగా 474 మందికి పత్రాలను అందజేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు, చింతల రాజశేఖర్, కానగంటి లక్ష్మీరాఘవ, జోగి రాజా, మున్సిపల్ కమిషనర్ ఏ.భాను ప్రతాప్, రెవెన్యూ ఆఫీసర్ పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

పిట్టలవానిపాలెంలో...

పిట్టలవానిపాలెం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 22వ తేదీన కోమలి, సంగుపాలెం, కోడూరు గ్రామ సచివాలయాలలో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కోన రఘుపతి పాల్గొంటారని తెలిపారు. ఈఓపీఆర్డీ కె.పద్మజ ఉన్నారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం..

రేపల్లె రూరల్: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని సర్పంచ్ తలశిల శ్రీనివాసరావు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాజుకాల్వ సచివాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 850 సర్టిఫికెట్‌లు అందజేశారు. ఎంపీడీఓ కె.శివపార్వతి, డిప్యూటీ తహసీల్దార్‌సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పోటుమెరక గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జునరావు, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, సర్పంచ్ కాగిత హనుమ ప్రసాద్‌లు పాల్గొని 804 సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. పట్టణంలోని 18వవార్డు అరుంధతీ నగర్‌లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, కమిషనర్ విజయసారథి, కౌన్సిలర్ అద్దేపల్లి వెంకటస్వామిలు 650 సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



గుర్నాథ్ నగర్‌లో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి

గడప గడపకు మన ప్రభుత్వంలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

నిజాంపట్నం: పట్టణ ప్రాంతాలకు దీటుగా గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుర్నాథ్ నగర్, హరీసుపేట గ్రామాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు జగనన్న ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారన్నారు. వివిధ రకాల ప్రభుత్వ సేవలను పొందేందుకు దూరప్రాంతాలకు పనికట్టుకుని వెళ్లేరోజులు పోయాయని, తాము నివసించే గ్రామాలలోనే ఏర్పాటు చేసిన సచివాలయం, వలంటీర్ల వ్యవస్థతో అనేక సేవలు గ్రామాల ముంగిటకే వచ్చేశాయన్నారు. ఈ సందర్భంగా హారీస్‌పేట గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామస్తులు రహదారులు, తాగునీటి వంటి సమస్యలను మోపిదేవి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా గుర్నాథ్ నగర్ గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. గ్రామంలో అంతర్గత రహదారుల సమస్య నెలకొందని స్థానికులు తెలియజేయడంతో, త్వరలోనే రహదారులను ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరునాథ్, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మదన్, సర్పంచ్‌లు తోకల అశోక్, కౌంతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్‌లైన్ ఏర్పాటుకు భూమిపూజ

నిజాంపట్నం: నూతన విద్యుత్ లైన్‌ల ఏర్పాటుతో నిరంతర విద్యుత్ సరఫరా ఉంటుందని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. మండలంలోని అడవులదీవి గ్రామంలో నూతన విద్యుత్ లైన్‌ల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ రూ.కోటి వ్యయంతో అడవులదీవి గ్రామ పంచాయతీలోని గ్రామాలకు 24 గంటల విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయటం జరుగుతోందన్నారు. దీనిలో భాగంగా అన్ని గ్రామాలలో నూతన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి 20 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అడవులదీవి పంచాయతీ పరిధిలోని గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా త్వరలో ఇవ్వటం జరుగుతుందన్నారు. ప్రభుత్వం రూ.కోట్ల వ్యయంతో గ్రామాలను అభివృద్ధి చేయటంతో పాటు విద్య, వైద్యం, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతుల ఏర్పాటుకు పెద్దపీట వేయటం జరుగుతోందన్నారు. అనంతరం నాయుడువారిపాలెంలో సీసీ రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మదన్, సర్పంచ్ కౌంతి శ్రీనివాసరావు, రైతుబాబు, వీరరాఘవయ్య, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు


ఇంటింటి సర్వే పారదర్శకంగా చేపట్టండి

తహసీల్దార్ నాంచారయ్య



కొల్లిపర: ఓటర్ల జాబితాలో పొరపాట్లు లేకుండా పక్కాగా జాబితా సిద్ధం చేసేందుకు ఈనెల 21 నుంచి ఆగస్టు 21 వరకు మండలంలోని బీఎల్‌ఓలు ఇంటింటా సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ జి.నాంచారయ్య తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల జాబితాలతో ఈనెల 21 నుంచి ఆగస్టు 21 వరకు ప్రతి ఇంటికీ బీఎల్‌ఓలు వెళ్లి , ఓటర్లు తమ పేర్లు, ఆధార్ నంబర్లు, ఇంటి పేర్లు తదితర వివరాలు జాబితాలో సరిగా ఉన్నవీ లేనిదీ సరి చూసుకోవాలన్నారు. ఈ సర్వే కార్యక్రమం ద్వారా కొత్త ఓటర్ల నమోదుతో పాటు తొలగింపులు, చేర్పులు, వివరాల మార్పులు కూడా చేపట్టాలన్నారు. ఓటర్ల నమోదులో ఎలాంటి రాజకీయ పక్షపాతం లేకుండా 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఎక్కడైనా అర్హత లేని వారికి ఓట్లు ఉంటే రాజకీయ పార్టీలు ఫిర్యాదులు అందిస్తే అలాంటివాటిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిజమైతే తొలిగించాలని చెప్పారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉన్నట్లయితే ఆధారాలతో సహా ఆర్డీఓ కార్యాలయానికి ఫిర్యాదు చేస్తే విచారణ చేసి , ఒక చోట ఓటు ఉంచి , మరోచోట తొలగించడం జరుగుతుందన్నారు. ఓటర్లు ఓటర్ల సర్వేకు వచ్చే సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్‌ఓలు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

జీవామృతాల తయారీలో శిక్షణ



తెనాలి: ఖరీఫ్‌లో పంటల సాగుకు అవసరమైన ఘన, జీవామృతాల తయారీలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి కొల్లిపర మండల గ్రామం అత్తోటలోని ప్రకృతి వ్యవసాయ కేంద్రం 'భూమి భారతి'లో బుధవారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. తెనాలి డివిజనులో కొత్తగా నియమితులైన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది 30 మంది పాల్గొన్నారు. వీరిలో 20 మంది వరకు మహిళలున్నారు. ప్రకృతి సాగుకు అవసరమైన ద్రవ జీవామృతాల్లో దశపర్ణి కషాయం (పది రకాల ఆకులతో కషాయం), ఆగ్నాస్త్రం తయారీలో అత్తోటకు చెందిన ప్రకృతి రైతు, భూమి భారతి వ్యవస్థాపకుడు యర్రు బాపన్న వీరికి శిక్షణనిచ్చారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగానికి చెందిన ఎస్ఎఫ్ఏ, సీఆర్పీ, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన అవసరం

పిట్టలవానిపాలెం: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని మండల తహసీల్దార్ కవిత విద్యార్థులకు సూచించారు. మండలంలోని అల్లూరు మంతెన సత్యనారాయణరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9,10 తరగతుల విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని సూచించారు. ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాప్రతినిధులను ఎన్నుకునేందుకు వీలుంటుందని తెలిపారు. ఆర్ఐ అమానుల్లా ఖాన్, వీఆర్వో అలపర్తి వెంకట సుబ్బారావులు ఉన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

బాపట్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈనెల 21వతేదీన ఖాజీపాలెంలో చేపడుతున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోన రఘుపతి సూచించారు. జాబ్‌మేళా కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా కోన మాట్లాడుతూ ప్రముఖ కంపెనీలైన గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, రిలయన్స్ జియో, ఇన్ఫోకామ్ లిమిటెడ్, మెడ్‌ప్లస్ ఫార్మసీ, అపోలో ఫార్మసీ, యాక్సిస్ బ్యాంక్, ఐ.సి.ఐ.సి.ఐ.బ్యాంక్, హీరో మోటో కార్పొరేషన్, ముత్తూట్ ఫైనాన్స్, మాల్ టెక్ సొల్యూషన్స్ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్, కిషోర్‌కుమార్, రమేష్‌బాబు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు. వివరాలకు 9988853335 ,9032384374, 8555901198 నంబర్లలో సంప్రదించాల్సిందిగా సూచించారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

రేపల్లె: వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ రజాక్ తెలిపారు. పట్టణంలోని 6వ వార్డుకు చెందిన పువ్వాడ రమేష్(40) మంగళవారం రాత్రి తన ఇంటిలోని బాత్రూమ్‌లో పడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు రమేష్‌ను ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. మృతుని భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

కొల్లిపర: సైబర్ నేరగాళ్లపై దుకాణదారులు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆర్ వీంద్రరెడ్డి సూచించారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో బుధవారం రైటర్ డి.శ్యామ్ కుమార్, పోలీస్ సిబ్బందితో కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎక్కువ శాతం సైబర్ నేరాలు పెరుగుతునాయి దానిలో భాగంగా నేరలపై అవగాహన కలిగిండాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ పే వేయిస్తామని డబ్బు ఇవ్వాలంటూ వస్తే తిరస్కరించాలన్నారు. అనుమానిత వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

నిబంధనలు పాటించాలి

తెనాలిరూరల్: వాహన దారులందరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ జె. శ్రీనివాస్ సూచించారు. తెనాలి వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల సమీపంలోని మినీ లారీ స్టాండ్ వద్ద డ్రైవర్లతో ఆయన బుధవారం మాట్లాడారు. లారీలను ఫిట్‌నెస్ కోసం తీసుకెళ్లే సమయంలో పట్టణంలోకి వెళ్లకుండ వైకుంఠపురం, జగ్గడిగుంట పాలెం, చినరావూరు మీదుగా ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. అత్యవసరమైనప్పుడే హారన్‌వినియోగించాలని, మల్టీటోన్డ్ హారన్‌లు వాడకూడదన్నారు. పరిమితికి మించి అధిక లోడు మినీ లారీల్లో వేయకూడదని, లోడుపైన ప్రజలను ఎక్కించుకోకూడదని సూచించారు.